# ఉక్కుగొలుసు

రచన.
శ్రీమతి. పఠానేని శ్రీశైల భ్రమరాంబ.

ప్రకృతి కన్య కప్పుకొన్న మేలిముసుగులాగ లోకమంతా మంచు దట్టంగా వ్యాపించివుంది. శ్రీ సీతారామస్వామి దేవాలయంలో ధనుర్మాసపు బాజాలు మ్రోగుతోంటే జనులహృదయాలు పులకితం చేస్తోంది. హరీనారాయణ గోవిందా! అంటూ హరిదాసులు చిందులు త్రొక్కుతూ చిడతలు వాయిస్తూ తాంబురా మీటుతోంటే, వేకువ అయిందని సంక్రాంతిముగ్గులు పెట్టేందుకై కన్యలందరూ లేచారు. పళ్లెంలో ముగ్గుపోసుకొని నెలవంకతో సంక్రాంతి ముగ్గు పెట్టి, రంగవల్లికలతో వాకిళ్ళన్నీ సింగారిస్తున్నారు - మధ్యన నెల - అటూ ఇటూ రకరకాల చిత్రవిచిత్రాలైన ముగ్గులతో వాకిళ్ళన్నీ మురిసిపోతున్నాయ్. ఎదురు, ప్రక్కగాను వున్న యిళ్లలోని కన్యలందరూ ఒకరితో ఒకరు పోటీలుపడి తమతమ చిత్రలేఖనా చాతుర్యాన్ని ప్రకటించుకొంటున్నారు - వయ్యారంగా ఒంగిఒంగి వల్లికలని సింగారిస్తూన్న శ్యామల పెట్టిన ముగ్గులే అందర్నీ ఎక్కువగా ఆకర్షిస్తున్నాయ్.

'అంబా పల్కు, జగదాంబా పల్కు, వాణి పలుకు, అలివేణి పలుకు' అంటూ ఢమరుక వాయిస్తూ వస్తూన్న బుడబుడక్కలవాళ్లు; ముష్టివాళ్ల కేకలు, జంగంవాళ్ల శంఖాలు, చిచ్చుకత్తెల పాటలు సంక్రాంతి నెల హడావిడితో, వీధుల్లోకి కొత్తకళ తీసుకువచ్చాయ్.

మంచు తెరను చీల్చుకొని సూర్యభగవానుడు తీరనిఆశలతో లోకపరిపాలనకు వస్తున్నాడు. బాలభానుని ఉదయకిరణాలతో ప్రకృతి శోభాయమానంగా ప్రకాశిస్తోంది. పట్టుచీర కట్టుకొన్న కొత్త పెళ్ళికూతురిలాగ ఆకాశం ఎఱ్ఱనికాంతుల్తో, నిగనిగా మెరుస్తూవుంది. ప్రభాత కిరణాల్తో లోకంఅంతా ఆనందంతో తన్మయత్వం పొందుతోంది. అభ్యంగ సంపూర్తిచేసుకున్న శిరోజాల తడి ఆరేలా పిడప చుట్టుకొని, పరికిణీ, గౌనుకి క్రిందవున్న ముగ్గులు అంటుకోకుండా 'గొబ్బెమ్మలు' పెట్టుకొని పూజచేస్తోంది శ్యామల. చేవులనున్న బుట్ట లోలకులు అల్లలాడుతోంటే, చేతులనున్న బంగారు గాజులు శరీరపు రంగుకి సిగ్గుపడినట్లు మెరుపు తగ్గాయి- కళ్లుమూసుకొని గొబ్బెమ్మలకినమస్కరిస్తోంటే, బాలభానుని లేత కిరణాలు ఆ బాలికముఖంమీదపడి ఏదో అద్భుతమైన కళలను ప్రసాదిస్తున్నాయ్.

సూర్యుడు ఉదయించి మంచును మాయంచేసి తనకిరణాల దివ్వెలు విశ్వమంతా వెల్గించాడు - ఉదయ కిరణాలు తెల్లని వెలుగు తొడుగులు ధరించుకొంటున్నాయ్.

ఈ ఆనంద సమయంలో శ్యామల తనుపెట్టిన ముగ్గులు ఆ వీధినున్న అన్నియిండ్ల ముందున్న ముగ్గులకంటే బాగున్నాయని ఆనందంతో గంతులువేసింది. తను కట్టుకొన్న సిల్కు పరికిణీ, గౌను చూచుకొనేసరికి శ్యామల ఆనందానికి మేరలేకపోయింది. ఆరోజుని పుట్టినరోజు. తనకి పదకొండు సంవత్సరాలు నేటితో పూర్తయి పన్నెండో వసంతం ప్రవేశించింది. ఆరోజు పుష్యశుద్ధ విదియ. ఆ బాలిక జన్మదినోత్సవమని కిలకిలా నవ్వుతూ లేచింది. తనకి ఆ సంవత్సరమంతా ఎంతో ఆనందంగా గడిచిందని ఉప్పొంగిపోతూ నూతన వసంతంలోకి అడుగుపెట్టింది. అంతలో ఏదో గుర్తొచ్చినదానిలా శ్యామల 'అమ్మా! సీతారామస్వామి కోవెల్లోకి వెళ్ళొస్తానే' అంటూ తుర్రుమంది.

గుడికి వెళ్ళి మూడు ప్రదక్షిణాలుచేసి గుడిలోపలికి వెళ్ళింది శ్యామల - గంట గణగణా మ్రోగించి, సాష్టాంగ దండప్రణామంచేసింది. 'సీతారామా' నాకు బాగా చదువువచ్చేటట్లు అనుగ్రహించు; ఈ థోర్డుఫారం ఫస్టుమార్కులతో ప్యాసయ్యేటట్లు చెయ్యి! ఈ ఏడు హిందీ 'రాష్ట్రభాష' సర్టిఫికెట్ తెచ్చుకోవాలని దీవించు తండ్రీ!' అని శ్యామల దేవుడికి దణ్ణంపెట్టుకుంది. కోవెల పూజారి ఆచార్యులుగారిచ్చిన ధనుర్మాసపు దద్దోజనం, చెక్కరపొంగలి, పులిహోర మూడు ప్రసాదాలు ఆకులతో పట్టుకొని యింటికి వస్తూంటే మధ్య త్రోవలో శ్యామల చెల్లెళ్లిద్దరూ ఎదురయ్యారు. ఇంటి దగ్గరున్న అక్కయ్యకు ఒక ఆకులో ప్రసాదంవుంచి మిగతా తను చెల్లెళ్లు తిన్నారు.

'అక్కా! అక్కా! చక్కరపొంగలి ప్రసాదం ఇదుగో' అంటూ ఎగురుకుంటూ పిల్చింది శ్యామల.

'గట్టిగా అరవకు - నాన్న సంధ్య వార్చుకుంటున్నాడు' అంటూ వచ్చి చెల్లి చేతిలోని ప్రసాదం అందుకుంది సీత.

'అక్కా! నాన్న రెండుపూటలా ఎంత తొందరపనులున్నా సంధ్య వార్చడం మానరు కదా! ఇంత భక్తి శ్రద్ధలతో సూర్యభగవానుని అర్చించే నాన్నకి ఎప్పుడూ డబ్బు కొరత ఎందుకుచేస్తాడే ఆ దేవుడు?' అమాయికంగా అడిగింది శ్యామల.

'నీ యక్షప్రశ్నలకి ఎవ్వరూ సమాధానం చెప్పలేరు. నాకు యింట్లో పనుంది. ఎక్కడికీ వెళ్ళక చెల్లాయిని ఆడిస్తూ కూర్చో' అని మూడేళ్ళలక్ష్మిని చేతికిచ్చి లోపలికి వెళ్ళిపోయింది సీత.

శ్యామల ఆకాశంమీద మబ్బుల్నీ, ఉదయకాంతుల్నీ, బాలభాస్కరుణ్ణీ చూస్తోంది. శ్యామల హృదయం ఎందుకో ఆనందంతో తల ములకలయింది. తన్మయత్వంతో అలాగే చూస్తో కూర్చుంది. ఎదురింటిమామ్మగారు డాబామీదనుంచి సూర్యనమస్కారాలు చెయ్యడం శ్యామలకి కనిపించింది. ఎందుకో శ్యామల చిన్నారి హృదయంలో ఎన్నో భావపరంపరలు దొర్లిపోతున్నాయి. ప్రతీ రోజూ చీకటిని పోగొట్టడానికి వస్తాడు భాస్కరుడు—మానవ లోకానికి వెలుగు ఇస్తాడు—మళ్ళీ లోకాన్ని అంధకారంలో ముంచి ఎక్కడికో వెళ్ళిపోతాడు—రాత్రి అయ్యేసరికి నక్షత్రాలు లోకాన్ని చూచి కిలకిలా నవ్వుతూంటాయి—చందమామ, చల్లని వెన్నెలలని చిమ్ముకుంటూ మనోహరంగా ప్రకాశిస్తాడు ఏమిటీ చిత్రం? అందర్నీ నడిపించే సర్వేశ్వరుడు కొందరికి ధనం, మరికొందరికి బీదతనం ఎందుకిచ్చాడు? సూర్యచంద్రులు అందర్నీ సమానదృష్టితో చూచినట్లుగా, ఆ ప్రత్యక్ష దైవాలని నడిపించే భగవంతుడుకూడా మానవులందర్నీ ఎందుకు సమానంగా చూడడు? నాన్న ఎంతో మంచివాడు; అమ్మ చాలా మంచిది; ఆయిదుగురం అక్కచెల్లెళ్ళం వున్నాం; అన్నీ బాగున్నాయే కాని బామ్మగొడవ చాలా ఎక్కువ. బామ్మకి తనపంతమే నెగ్గాలంటుంది. అత్తయ్య చెప్పినా వినదు—బామ్మకీ అత్తయ్యకీ నాన్న ఎదురు చెప్పలేదు. నాన్నంటే పిల్లలందరికీ హడల్—ఏమిటో తమ యింట్లో పరిస్థితి అంతా బలే తమాషాగా వుంటుంది. ఏది ఏమైనా తనకు కనీసం స్కూల్ ఫైనల్ వరకూ అయినా చదువు చెప్పిస్తే చాలనుకొని సూర్యనారాయణమూర్తికి నమస్కారం చేసుకొంది శ్యామల.

'ఏమిటే శ్యామలా! అంత శుద్ధ బుద్ధావతారంలా కూర్చుని జపం చేస్తున్నావు?' తల్లి శాంతమ్మ కాఫీ చల్లారబోస్తూ అడిగింది.

'అమ్మా! రేపటినుంచి సంస్కృతం నేర్చుకోవాలనుకుంటున్నా, ఓ దస్తా తెల్లకాగితాలు కొనవూ?' చిరునవ్వుతో అంది శ్యామల.

'నువ్వు రాష్ట్రానికి కట్టాక ఇంకా సంస్కృతం కూడా చదువుకోగలనన్నా ధైర్యం వుంటే తప్పకుండా కొంటారు మీ నాన్న' ఎంతో వాత్సల్యంతో అంది. శాంత కళ్ళల్లో నిష్కల్మషమైన ప్రేమ, ఆ చూపుల్లో ఏదో దివ్యతేజస్సు ప్రకాశిస్తోంది. ఆ మాటల్లో అనురాగ వర్షం కురుస్తోంది.

తల్లి మాటతో శ్యామల కిలకిలా నవ్వుతూ 'ఇవ్వాళ్టినుంచే నేనూ సరోజతోపాటు సంస్కృతం ప్రారంభిస్తా, సరోజకి వాళ్ళ నాన్నగారే చెప్తారుట. నాకూ ఆమెతోబాటే చెప్తానన్నారు. ఎన్మిదిగంటలకే రమ్మన్నారు. మరి ఈలోగానే... పుస్తకానికి కాగితాలు కావాలి' తల్లి ముఖంలోకి చూచింది శ్యామల.

'నువ్వు ఎల్లాగైనా అదృష్టవంతురాలివే శ్యామలా! నీకు కావల్సిన పుస్తకాలకీ, కలానికీ అన్నింటికీ అమ్మా డబ్బిస్తుంది; నీ చదువుకి నాన్నా సమ్మతించారు; నా బ్రతుక్కి...ఏమీ లేదు' తన తీరని వాంఛను బయటపెట్టింది సీత.

'కష్టపడి చదువుకొంటే నువ్వూ అదృష్టవంతురాలివే అవుదువు. నాల్గో క్లాసులోనే దండయాత్ర చేస్తే ఇంకేం చదివిస్తారే అక్కా? ఇప్పుడైనా నీకు ఆ సరదావుంటే నాతోబాటు సరోజగారింటికి వస్తే 'పంచకావ్యాలు వరకూ నీకూ చెబుతారు.'

'ఆ! మాటలవరకే—నీకుమల్లే నేనూ చదువుకొందుకు బయల్దేరితే నాన్న, బామ్మ, అత్తయ్య కల్సి కర్రపుచ్చుకొంటారు.'

'అయితే హాయిగా కూర్చుని బావతో బాతాఖానీ వేసుకో-నా చదువుకోసం అసూయపడకు.'

'నీ చదువుకోసం ఎవరూ దుగపడ్డంలేదు - ఇంట్లో

(తరువాయి 26వ పేజీలో)

(10వ పేజీ తరువాయి)

మూడువేళ్ళ పని ముట్టుకోకుండా నీవలె చదువుకొంటే నేనూ ఫస్టుమార్కులు తెచ్చుకొంటూ, అయిదులు, పదులు పందాల్లో గెలిచేదాన్నే... పోనీ నువ్వు చదువుకొని ఊళ్ళేలి ఉద్యోగాలు వెలిగించేదీ లేదు; నేను చదువుకోకపోయినందువల్ల నష్టమూ లేదు.'

'ఈపాటిదానికి నీ ఉక్రోషాన్ని కక్కడమెందుకే అక్కా! నువ్వు ఎల్లా అనుకొన్నా నేనుమాత్రం యస్సెల్సీవరకూ చదివి ఉద్యోగం చేస్తాను...ఓచ్చ్' అంటూ ఊరించింది శ్యామల.

'సీతా! నువ్వుకూడా దానితో సమంగా వాదిస్తావెందుకే? అబ్బబ్బ మీ యిద్దరూ పిల్లీ ఎలకాలాగ పోట్లాడుకొంటారు-మళ్ళీ ఒక్కక్షణం ఒకర్నివదలివకరు వుండలేరు. ప్రొద్దున్నే వాదులాట పెట్టుకోకండి' అని కరిసిరింది తల్లి. అంతలో తండ్రి వీరభద్రంగారు రావడంతో అక్కా చెల్లెలు కిక్కురుమనకుండా కూర్చున్నారు. తల్లి అందరికీ కాఫీలు గ్లాసుల్లో పోసింది.

'శ్యామలా! ఈ అరటిపళ్ళూ దక్షిణా తీసుకువెళ్ళి సీతారామస్వామి కోవెలకు వెళ్ళిరా. ఇవ్వాళ నేపుట్టిన రోజు పండుగ కాబట్టి దేవుడికి నైవేద్యం సమర్పించాలి' అంటూ వీరభద్రం పళ్ళూ, కానీ, శ్యామల చేతికి ఇచ్చాడు.

శ్యామల రఁయ్‌మంటూ కోవెలవైపుకి పరుగెత్తింది. కోవెలకీ వారింటికీ మధ్య నాలుగిళ్ళు మాత్రమే అడ్డు. శ్యామల గుడిలో ధ్వజస్తంభాన్ని చూస్తూ కొంతసేపు నిల్చుంది. ధ్వజస్తంభం పైన చిరుగంటలు గణగణా మోగుతూ ఆకాశంలో సంగీతం ఆలాపిస్తున్నాయ్. దేవాలయ గోపురంమీద కాపురం చేస్తూన్న పావురాల పిల్లలు తటతటా రెక్కలు కొట్టుకొంటూ పెనగులాడుతున్నాయ్. గాలికి ఎగిరిపోవాలని బయటకొచ్చి తొంగి తొంగి చూస్తూ మళ్ళీ ముడిచిపెట్టుకు కూర్చున్న ఆపావురాల పిల్లల్ని చూస్తోంది శ్యామల. మళ్ళీ దృష్టినిల్పి గాలిగోపురంమీది బొమ్మల్ని పరికించి చూస్తూ కొంతసేపు ఏవేవో ఊహించుకొంటోంది.

'శ్యామలా! ఇంకా ఇక్కడే వున్నావా? మా నాన్నగారు నిన్నుకూడా పిల్చుకురమ్మన్నారు' అంటూ భుజంమీద చెయ్యివేసింది సరోజ.

శ్యామల సరోజా కల్సి కోవెల్లోకి వెళ్ళి దేవుడికి తమ కోరికల దండకాన్ని నివేదించి, పూజారిపెట్టిన శఠగోపం అందుకొని, అరటిపళ్ళ ప్రసాదాన్ని స్వీకరించి బయటికి వచ్చారు.

'మా నాన్న కాగితాలకి ఇప్పుడు డబ్బులు ఇస్తారో, ఇవ్వరో' అంది సందేహిస్తూ శ్యామల.

'ఫరవాలేదు - నేను చెప్పి మీఅమ్మచేత ఇప్పిస్తాగా - మీ అమ్మ చేతిలో లేకపోతే ఇవ్వాళ సరిపోయిన కాగితాలు నేనేఇస్తా' సరోజ సముదాయించింది -

శ్యామల యింటికిరాగానే 'నాన్నా! తెల్లకాగితాలకి డబ్బులివ్వవూ?' అనడిగింది బెరుకుగా-

'మధ్యాహ్నం చూస్తాలే! ఇప్పుడు దగ్గరలేవు'

'అదేమిట్రా? పిల్లఅంతసంబరంగా అడుగుతూంటే,,, ఇలారావే శ్యామలా!' అంటూ పిల్చి ఒత్తుల తాటాకు పెట్టెలోనుంచి పావలాతీసియిచ్చింది నాయనమ్మ అమ్మన్నగారు -

'బామ్మా! తొలిసారిగా నువ్వే యిచ్చావ్ - నేను సంస్కృతం పంచకావ్యాలూ పూర్తిచేసి 'విద్వాన్' పరీక్ష ప్యాసు అవ్వాలని దీవించవే' అంటూ కిలకిలా నవ్వుతూ దణ్ణంపెట్టింది.

'నా చిట్టితల్లి బంగారు కొండ! ఎంత అల్లరి, హడావిడిచేస్తుందో; చదువులో అంత చురుకైనది- నా చిన్నారితల్లికోసం ఏ మొగుడో బంగారు పువ్వులతో పూజచేస్తున్నాడు!! అంటూ శ్యామల రెండుబుగ్గలూ నిమిరి ముద్దెట్టుకొంటూ బోసినోరుతో నవ్వింది నాయనమ్మ,

'రావే శ్యామలా! మళ్లీ టైమ్ అయిపోయిందని మా నాన్నగారు కోప్పడ్తారు' సరోజ ఆమెచెయ్యిపట్టుకొని వీధిలోకి తీసుకుపోయింది.

సరోజ, శ్యామల కల్సి కాగితాలు కొనుక్కొని పంతులుగారి దగ్గరకు పరుగెత్తారు - అత్యంతాసక్తితో, శ్రద్ధాభక్తులతో శ్యామల సంస్కృత పాఠం ప్రారంభించింది.

శ్యామల చదువుకుని యింటికి వచ్చేసరికి మేన[illegible] పాపమ్మ 'ఇల్లారావే' అని పిలవడంతో భంగున లేడిపి[illegible]లా గంతులేస్తూ మేనత్త ఒళ్లో దూరింది - 'శ్యామల[illegible] ఇవిగోనే నీకు జడకుచ్చులు చేయించాము' అంటు[illegible] చేతిలో పెట్టేసరికి, ఒక్కరోజువే ఇన్ని సంతోష విషయాలు, బహుమతులు తన్నుచుట్టు ముట్టడంతో శ్యామల లేతహృదయం జడకుచ్చులు చూచుకొంటూ - ఏదో పరవశత్వంపొందిండ.

(సశేషం)

Edited and Published by A. N. Raghavachar, No, 32, Krishnappa Naick Tank St., Madras-1
Printed by V, Kuppuswamy Chetty, Bharathamatha Press, No, 39, Anderson St., Madras-1

# ఉక్కు గొలుసు

రచన.
శ్రీమతి. పఠానేని శ్రీశైల భ్రమరాంబ.

(గత సంచిక తరువాయి)

'అక్కా! అక్కా! ఇవ్వాళ కొత్త పరికిణి గౌను నాన్న బహుమతి, పుస్తకానికి కాగితాలు బొమ్మ, జడ కుచ్చులు అత్తయ్య, మరి...' ఆనందంతో ఎగిరిపోతోంది శ్యామల.

'నా బహుమతి' ఫౌంటెన్ పెన్' అంటూ సీత భర్త వైకుంఠరావు ఇచ్చాడు -

'బావా! మరి సినిమాకికూడా తీసుకువెడ్తావా?' మురిసిపోతూ అడిగింది శ్యామల.

'ఓ! అందరం మ్యాటినీకి వెళ్దాం!'

అక్క, బావ, చెల్లెళ్లతో కల్సి సినిమాకి వెళ్ళింది శ్యామల. అంతా హాలులో కుర్చీలమీద ఆసీనులయ్యారు- ఆటప్రారంభించిన పదినిమిషాల్లో వైకుంఠరావు భుజం మీద ఒక వ్యక్తి చెయ్యివేసితట్టి 'నీ ప్రక్కని కూర్చున్న ఆమె, ఆ ప్రక్కనివున్న అమ్మాయి ఎవరోయి? అని ప్రశ్నించడంతో ఆటచూడ్డంలో మునిగివున్న అతడు బాహ్యంలోకివచ్చి 'ఎవరు?' అన్నట్లుగా చూచాడు.

'నేనోయ్! నీలకంఠాన్ని ... నీకోసం మీయింటికి వెళ్ళి అడగ్గా నువ్వు యిక్కడకు వచ్చావని మామగారు చెప్పారు - నీతో ఒక ముఖ్య విషయమై మాట్లాడాలని....'

"పిక్చర్ పూర్తయ్యాక మాట్లాడకూడదా?..."

"వీల్లేదోయ్-ఒక్కసారి బయటికి రావాలి"

యిద్దరూ హాలు బయటకువచ్చి మాట్లాడుకొన్నారు. ఆ మాటలే తన పెళ్ళిమాటలని శ్యామలకి ఏం తెలుసు? ఎంతో సంబరంతో సినిమా కథలో లీనమైపోయి చూస్తోంది.

సినిమా పూర్తి కాగానే అందరూ కలిసి యింటికి వచ్చారు. నీలకంఠం, ఆతనితో వచ్చిన మరో యిద్దరు మిత్రులూ అందరూ కలిసి వీరభద్రంగారింటికి వచ్చారు.

పెళ్ళి మాటలు ప్రారంభమయ్యాయి.

నీలకంఠం స్థితిగతులన్నీ పదేళ్ళ క్రిందటివరకూ వైకుంఠరావుకి తెలుసు. ఈనాడు అంతకు రెట్టింపు ఐశ్వర్యంతో వున్నాడని ఆతనితో వచ్చిన పెద్దలు చెప్పారు. పేద కుటుంబంలో పుట్టిన శ్యామలకి లక్షాధికారియైన పెళ్ళికొడుకు వచ్చాడని మురిసిపోయారు. ఎటొచ్చీ వయస్సులో మాత్రం యిద్దరికీ యిరవైఏళ్ల వ్యత్యాసం. అయినా ఈపాటి వయస్సు తేడాకోసం ఎవరూ విచారించలేదు. తథాస్తు! అన్నారు.

సరిగ్గా నెలరోజులకి నీలకంఠంకు శ్యామల భార్య అయింది. పెళ్ళినాడైనా వరునితాలూకు బంధువులెవ్వరూ రాలేదనీ, మంచి చీరలు, ఆభరణాలు ఏమీ పెట్టలేదనీ శ్యామల తల్లితండ్రులు, మేనత్త, నాయనమ్మ వగైరాలంతా మనస్సుల్లో శంకించారు. నవ్వుతూ వైకుంఠరావు "ఏమోయ్! నీలకంఠం! మా మరదలి ఒంటిమీద మణుగు బంగారం బరువు వుంచుతావనుకొంటే...ఏమిటీ వింత?"

"ఇప్పుడేం పెట్టదల్చుకోలేదోయ్. త్వరలోనే... శ్యామలని మా యింటికి తీసుకువెళ్ళాక నా ప్రథమ భార్యయొక్క నగలన్నీ ఈమెనే అలంకరించుకోమంటాను" చల్లగా చెప్పాడు.

"అయితే నీకు ద్వితీయమా? యిప్పటివరకూ అసలు పెళ్ళిచేసుకోలేదనే చెప్పావుకదా!" ఈ సంగతి ముందుగా చెబితే—

"ఈ పెళ్ళి జరగదని ఆ రహస్యం దాచిపెట్టాను" సన్నగా చెప్పాడు నీలకంఠం.

"అయితే నీకు యిదివరకు వున్న ఆస్థి అంతావుందా? అదీ అబద్ధమేనా?" సందేహంగా అడిగాడు వైకుంఠరావు.

"వెర్రివాడా! ఆస్థితనం వుంటే యింత ఏకాంతంగా వచ్చి, మిత్రులచేత చెప్పించి, మీకు నచ్చేలా డబ్బిచ్చి వారిచేత అబద్ధాలు ఎందుకు పలికిస్తానోయ్. మీరంతా ఏ విషయంలో నేను గొప్పవాడినని భ్రమించారో; ఆ భ్రమ అంతా ఎండమావులు... నెలరోజులపాటు విశ్వప్రయత్నంచేసి సాధించి సఫలీకృతుడనై శ్యామలను భార్యగా పొందాను...యింక నన్ను నువ్వేమీ అడక్కు వైకుంఠం!" అంటూండగానే అక్కడకు కళ్యాణనామంతో, కొత్త మంగళసూత్రాలతో వున్న శ్యామల వచ్చింది.

ఏదో తప్పుచేసినవాడిలాగ వైకుంఠరావు అక్కడ

నుంచి నిష్క్రమించాడు. యించుమించు తన తండ్రితో సమ వయస్కుడగు ఆ పెళ్ళికొడుకుని తేరిపారి చూస్తూ నిల్చుంది శ్యామల.

"వైకుంఠరావు లక్షాధికారి - నిన్ను సుఖపెడ్తాడు- నీవల్ల నీకున్న ధనంతో మేముకూడా కొంచెం అభివృద్ధి పొందవచ్చు. ఈ పెళ్ళి జరిగితే మన కుటుంబంలోని వారంతా కూడా అదృష్టవంతులు" అన్న తండ్రి మాటలు గుర్తొచ్చి తల వొంచుకుని అక్కడనుంచి వెళ్ళిపోయింది శ్యామల.

* * *

శ్యామల కాపురానికివచ్చి పది వసంతాలైంది. ఈ పదేళ్ళల్లోనూ ఆమె నూరు సంవత్సరాల జీవితానుభవాల్ని పొందింది. శ్యామల కాపురానికి వచ్చిన తొలిరోజుల్లో నీలకంఠం ఆమెను చూచేసరికే ఆనందోత్సాహాలు వెల్లివిరిసిపోతూ పల్కరించేవాడు. శ్యామలవంటి భార్య దొరికిందని అనిర్వచనీయమైన గర్వాన్ని పొందుతూ మురిసిపోయేవాడు. అల్లా కొద్ది నెలలు మాత్రమే గడపగలిగాడు నీలకంఠం. ఒక్క వసంతం పూర్తికాకుండానే శ్యామలమీద ఆ అపేక్ష అంతా తీరిపోయినట్లు, అతని మనస్సులో అనురాగమంతా అధికారంగా మార్చుకొని పురుష సహజమైన అహంకారానికి దాసుడై "మంచీ-చెడు" అనే వివక్షతలేకుండా అతని మాటలే శిలాక్షరాలనీ, అతని చేష్టలే వేదవాక్కులనీ భావించుకోమని భార్యని దండించడం ప్రారంభించాడు.

కాలం దొర్లిపోతోంది. కాలంతోపాటు మానవ హృదయాలుకూడా మారిపోతున్నాయ్. శ్యామల మనిషి మనస్సుకూడా పూర్తిగా మారిపోయింది. తన భర్త నీలకంఠంకు నలభైఏళ్లు దాటాయి. అతనికి వయస్సు పెరుగుతూన్నకొద్దీ శ్యామలను అంక్షపెట్టడం, నిర్బంధించడం ఎక్కువైపోయింది. శ్యామలను ఉక్కుగొలుసుల్లో బంధించి జైల్లోవుంచినట్లుగా యింట్లోవుంచి బయట తాళం వెయ్యటం ప్రారంభించాడు. యింతకీ కారణం నీలకంఠం ప్రథమభార్య కొడుకు ఆ ఊరిలో ఒక "ప్రెస్"లో గుమస్తాగా పనిచేస్తూ వీరింటికి ప్రక్క యింట్లో కాపురంవుండడమే అతని అనుమానానికి నాంది.

శ్యామల అందగత్తె—తన కొడుకు శ్యామలరావు అందగాడు. యిద్దరూ సమవయస్కులు. యిద్దరివీ ఒకే రకపు అభిరుచులు. అందుకతోడు శ్యామలరావు భార్య సుదక్షిణకి (సవతి)అత్తగారంటే ఎంతో భక్తి, గౌరవం. యివన్నీ అపార్థం చేసుకొని భార్యని నిర్బంధంలో వుంచాడు నీలకంఠం.

స్త్రీ సహజమైన మాతృవాత్సల్యంతో శ్యామల రావునీ అతని భార్యనీ ఆదరించాలనీ, గృహిణీధర్మమైన పతిసేవచేస్తూ భర్తకు దైవత్వాన్ని ఆపాదించి ఆరాధించాలనీ, తన పుట్టినింటిలోవున్న తన వారినందర్నీ ఒక్కసారి కళ్ళారాచూచి వారి అనురాగాన్ని ఆదరాభిమానాల్ని పొందాలని ఎంతో ఉవ్విళ్లూరిన శ్యామల ఆశలన్నీ అడియాసలయ్యాయి. శ్యామల కాపురానికి వచ్చి పుష్కరమైనా మళ్ళీ తన పుట్టినింటివారిని కళ్ళతో చూడలేదు. తనని అక్కడికి పంపకపోయినా; వాళ్లయినా యిక్కడకు రావాలంటే నాలుగు జిల్లాలుదాటి కూతుర్ని కంటితో చూడగల్గిన ఆర్థిక స్తోమతు వీరభద్రంగారికి లేదు. అందుకే ఒంటరిగావున్న శ్యామలకి తన చిన్నతనం గుర్తొచ్చేసరికి కళ్ళల్లో నీళ్ళు గిర్రున తిరుగుతాయ్ తనలో తనే ఏదో ఆలోచించుకొంటూంటుంది.

శ్యామల తనలో తనే ఏదో భరింపలేని ఆవేదన పొందుతూంటుంది. చివరకోనాడు తనలోని వేదన, వ్యథ అంతా ఒక కాగితంమీద నింపింది. తన వేదనలోని వేడినంతా ప్రతిఫలింపజేస్తూ, కన్నీటికిబదులుగా కలంతో గుచ్చిన కాగితాన్ని కవరులోపెట్టి కన్నవారికి అందించమని కోడలు సుదక్షిణకి యిచ్చింది శ్యామల.

ఆవేదన వున్నప్పుడు ఆశ తప్పదు. ఆవేదన, ఆశ అవినాభావసంబంధం గలవి కనుకనే తను వ్రాసిన లేఖలు చూచియైనా తన తల్లితండ్రులువచ్చి తనని తీసుకువెడ్తారని ఆశించి యెదురుచూచేది శ్యామల.

శ్యామల ఏకాంతంగా కూర్చుని, అమూల్యమైన ఆలోచనలతో, ఆదర్శవంతమైన తన ఆశయాలనన్నింటినీ, ఆచరణలో పెట్టాలనుకొన్న అభ్యుదయ భావాలన్నీ ఏర్చికూర్చి, పేర్చి ఒక వ్యక్తిని సృష్టించి వాని చుట్టూ అల్లుకొంటూ కాగితంమీద నింపుతోంది. లోకంతో సంబంధంలేని శ్యామల కాగితాలు కలంతో కాలాన్ని తర్లించడం ప్రారంభించింది.

జీవితం అన్న కట్టడంమీద "వాణి" ప్రసన్నతకల్గి

ఆ భారతీ కృపారసవీక్షణ కాంతిరేఖ ప్రసరించినప్పుడు; ఎన్నివిధాల ఎందరు అడ్డుకొన్నా ఆగక హృదయంలో నుంచి దానంతట అదే ఉప్పొంగి పొర్లి బయటికి ప్రవహిస్తుంది. అల్లా బయటికిరాకుండా యే కొద్దికాలమో ఆపినా ఆ వాణీ ప్రసన్నతకల్గిన వ్యక్తి హృదయంలోని కవిత నవమాసాలు పూర్తయి మాతృగర్భంలోనుండి భూలోకానికి రాబోయే శిశువులా గిజగిజ కొట్టుకొంటూ, సముద్రపు అలల్లాగ పైకి ఎగరివస్తూ, నురుగులు క్రక్కుతూ ఊరంలు వేస్తూ, పరుగులిడుతూ, ఆ వ్యక్తి మస్తిష్కాన్ని మధిస్తుంది. కొద్దిరోజులు దాకుడుమూతలతో సంఘర్షణ పొందినా చివరకు అన్నిటినీ ఛేదించుకొని బయటకు వస్తుంది. వాణికి వారధి, ఆనకట్టుకట్టడం మానవసాధ్యం కాదు. అల్లాగే శ్యామలకి 'శారదా'నుగ్రహం కల్గింది. ఆమె ఏకాంతవాసమే ఆమె సాహిత్యసేవకి 'నాంది' అయింది.

శ్యామల సాహిత్యసేవలో, విజ్ఞానవీధుల్లో ఉత్తమ దారినిబట్టి నడుస్తోంది. శ్యామల రాత్రింబగళ్ళు కలం పట్టుకొని కాగితాలునింపి కొడుకుకి అందిస్తోంది. ఆ రచనలన్నీ "శ్రీమతి శ్యామల" అనే పేరుతో అన్ని రకాల పత్రికలు ప్రచురణ సాగిస్తున్నాయి.

మూడు వసంతాలు గిర్రున తిరిగాయ్. శ్యామలరావు ప్రెస్‌లో గుమస్తాపనికి స్వస్తిచెప్పి స్వంతంగా ప్రెస్ కొని "శ్యామలా ప్రచురణలు" అనే సంస్థను స్థాపించాడు. "శ్రీమతి శ్యామల"గారి రచనలు శతగ్రంథాలు ప్రింట్ చేసి లక్షాధికారిగా మారాడు శ్యామలరావు. ప్రతీ పత్రికా శ్రీమతి శ్యామలయొక్క రచనలకి అగ్రస్థానంయిస్తోంది, 'శ్రీమతి శ్యామల' అనే రచయిత తన కొడుకేనని ఉప్పొంగిపోతున్నాడు నీలకంఠం. శ్యామల రచనలలోని ఆధిక్యతనీ, ఉన్నతభావాలనీ భార్యదగ్గర ఎంతో మెచ్చుకొని సంతృప్తిపొందుతూ తనలో తనే ఆనందిస్తున్నాడు నీలకంఠం. కొడుకు రచయిత అని మనస్సులో ఎంతగా ఆనందించినా తన భార్యనిమాత్రం కొడుకు కంటపడకుండా కఠిన నిర్బంధంలో వుంచుతున్నాడు. తిన తిండికీ, కట్టబట్టకీ లోటురాకుండా చూస్తూ వంటయిల్లు, పడకలదీ దాటి రానివ్వడంలేదు. బయట తలుపుకి తాళంవేసి సూర్యరశ్మినికూడా ఆమె మీదకి చొరనివ్వటంలేదు. ఒకందుకు నీలకంఠం ఆమెకి ఏకాంతం ఏర్పరిస్తే; అది మరొకందుకు వరప్రసాదంగా భావించుకొని సాహిత్యసేవాసోపానాలెక్కటం ప్రారంభించిన శ్యామల తారాపథాన్నందుకొంది.

ఆరోజు "శ్రీమతి శ్యామలకి బహూకరణ" యివ్వబోతున్నారు. ఆంధ్రదేశంలోని తెలుగు నవలలన్నింటిలోనూ అగ్రస్థానం వహించి పోటీలో గెలుపొందిన ఉత్తమ నవలారచయిత్రిగా ఆమెకి దేశమంత్రి బహూకృతి చేయబోతోన్న శుభదినం. గవర్నరును చూడాలని కొందరు, రచయిత్రిని దర్శించాలని మరికొందరు, ఎందరో ప్రముఖులు సభ అలంకరించారు.

ఆ సమయంలోకూడా నీలకంఠం తన భార్య శ్యామలను యింట్లోవుంచి బయట తాళంపెట్టి కొడుకుతో బాటుగా మీటింగుకి వచ్చేశాడు. సుదక్షిణను తీసుకు రమ్మని కొడుకుతో చెప్పాడు నీలకంఠం. కాని అందుకు

మీ వ్యవసాయాభివృద్ధికి...




Mnufacturing: 1 H.P. To 20 H.P. Motors.
1 H.P. To 10 H.P. Monoblock Setts.

Branch: 296, Thambu Chetty St., Madras-1

(Sole Distributors for Andhra Pradesh Except the Districts of Cudappa and Chittoor) M/s. Standard Commercial Corporation, Pitchiah Street, Labbipet, Vijayawada-2.

Chittoor Agents: M/s. Sivaraj Electricals.

అంగీకరించలేదు శ్యామలరావు. ఆంధ్రదేశంలో వుండే రచయితలందరూ ఆత్రుతగా వేదికవైపుకి చూస్తున్నారు.

వేదికమీద అమర్చిన ఆసనంలో గవర్నరుగారు బహూకరించదల్చుకొన్న కానుక ధగధగా మెరుస్తోంది. అధ్యక్షుడు లేచి "ఆంధ్ర అకాడమీ పోటీలో ప్రథమ బహుమతీ యాభైవేలరూపాయల పారితోషికం, వెండి కప్పూ తీసుకోడానికి రచయిత్రి వస్తారు" అని చెప్పడం; ఆ మాటలతో బాటుగా చిన్న కారు జనమధ్యలోనుంచి వేదికదగ్గరకిరావడం ఒకేసారి జరిగింది.

టాక్సీలోనుంచి దిగి వేదిక ఎక్కుతూన్న స్త్రీమూర్తి మీద ఒక్కసారిగా అందరినేత్రాలూ పడ్డాయి, వీరభద్రంగారు, ఆయన భార్య శాంతమ్మ, వారి పెద్దకూతురు సీత, ఆమె భర్త వైకుంఠరావు, వీరభద్రంగారి తల్లి, ఆయన తోబుట్టువు పాపమ్మ, యింకా...యింకా... అందరూ వేదికమీద నిల్చుని బహుమతీ తీసుకొంటూన్న రచయిత్రివైపు ఒళ్ళంతా కళ్ళుచేసుకు చూస్తున్నారు. నీలకంఠం తను చూస్తోన్నది కలా; నిజమా; ఏదీ అర్థం గాని సందిగ్ధంలో అచేతనంగా కూర్చున్నాడు.

"నాన్నగారూ! ఒక్కసారి మీరుకూడా లేచి అక్కడికి రావాలి" అన్న కొడుకు పిలుపుతో నీలకంఠంకు బాహ్యస్మృతి కల్గింది.

"ఉక్కు గొలుసులు" అనే నవల గవర్నర్ గారికి అంకితంయిచ్చి అభివందనం సమర్పించింది శ్యామల. శ్యామలా నీలకంఠం దంపతులమీద ఆశీర్వచన పద్య కుసుమాలు వెదజల్లారు పండితోత్తములు.

"నాన్నగారూ! కన్నతల్లిని పోగొట్టుకొన్న నిర్భాగ్యుడనైనా, మళ్ళీ ఈమెకు మాతృమూర్తి స్థానంయిచ్చినందుకు మీరుభయులూ నాకు పూజనీయులే! నా సేవకి మీరు సమ్మతించకపోయినా 'అమ్మ' ఆజ్ఞానుసారంగా అమ్మ విజ్ఞానాన్ని లోకానికి వెదజల్లి కోటిరూపాయల విలువగల పబ్లికేషన్‌ను నిలిపాను, నేటితో నా పని పూర్తయింది. అదంతా మీ ధనం. మీరు ఆశీర్వదిస్తే నేనూ నా భార్య కలవుతీసుకొని మరో ఊరు యిక్కడినుంచే వెళ్ళిపోతాం!" అంటూ శ్యామలరావు సుదక్షిణతో సహా తండ్రిపాదాలకు ప్రణమిల్లాడు.

"శ్యామూ! రాళ్ళల్లో రత్నాలుంటాయనీ, సామాన్య స్త్రీలల్లోకూడా యింతటి మహత్తరశక్తి యిమిడివుంటుందనీ నేనీనాడే గుర్తించగలిగాను. స్త్రీ పురుషులమధ్య నీచసంబంధం మాత్రమే వుంటుందని అపోహతో, సంకుచితభావాలు కల్గిన నాలో అజ్ఞానాంధకారాన్ని పోగొట్టిన మహనీయమూర్తులు మీ తల్లీ కొడుకులు. సాహిత్యసేవతో, విజ్ఞాననిధుల్లో ఉత్తమదారినిబట్టి నడిచే నా భార్యాబిడ్డలు సామాన్య మానవలోకానికి ఒక మెట్టు పైనుండవలసినవారని నా హృదయం ఆనందంతో పొంగిపోతోంది. నే నిన్నాళ్లూ చేసిన అన్యాయానికి నన్ను మన్నించి ఎప్పుడూ నన్ను వదలకుండా వుంటానని వాగ్దానంయియ్యి శ్యామూ!" అంటూ కొడుకుని కాళ్ళ మీదనుంచి లేవదీశాడు నీలకంఠం.

అంతలో వీరభద్రంగారి కుటుంబం అందరూ వచ్చి శ్యామలను చుట్టుముట్టి "శ్యామలరావు మమ్మల్నందర్నీ రమ్మని డబ్బు పంపించబట్టి ఈనాడీ మహోత్సవం చూడగల్గాం!"...అంటూ నీలకంఠంను అభినందించారు.

నీలకంఠం పరమానందంతో "ఆనాడు సంక్రాంతి రోజుల్లో శ్యామలలోని అందాన్ని చూడగల్గాను. ఈనాడు దీపావళికి ఈమెలోని మహత్తర విజ్ఞాన సంపత్తిని గుర్తించగలిగాను. రండి అందరం ఆనందంగా దీపావళి పండుగ చేసుకొందాం!" అంటూ యింటివైపుకి దారితీశాడు నీలకంఠం.

అందరి ముఖాల్లోనూ ఆనందం వెల్లివిరిసిపోతోంటే, భార్య, కొడుకు కోడలుతో, అత్తవారితో కలిసి యింట్లో అడుగుపెట్టాడు నీలకంఠం.

పండిత డి. గోపాలాచార్యులవారి
జీవామృతం
ఆరోగ్యానికి బలానికి
Diamond Jubilee
1898 1958
ఆయుర్వేదాశ్రమం (ప్రైవేట్) లిమిటెడ్,
మదరాసు-17.